మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం
కర్నూలు | కడప | నెల్లూరు
మంగళవారం 11 ఆగస్టు 2026 పేజీలు 16




# 'వెల్ఫేర్' టోకరా

## నెల్లూరు జిల్లా నాయుడుపేటలో నయా నయవంచన

" శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఒక ముఖ్య పట్టణం "నాయుడు పేట". చెన్నై వెంకటగిరి, నెల్లూరు, తిరుపతికి ముఖ్యమైన కూడలి నాయుడు పేట. స్వర్ణముఖి నదీ తీరాన్ని చెన్నై - కోల్ కత్తా జాతీయ రహదారి మీద చెన్నై - నెల్లూరు మధ్య నాయుడు పేట మండలం తుమ్మర్రు విలేజ్ ఉన్నది. నూతన రాష్ట్ర ఆవిర్భావంలో భాగంగా ఈ ప్రాంతంలోని మెగా మల్టీ ప్రాడక్ట్ సెజ్ కు ఎన్నో ఇండస్ట్రీస్ రాబోతున్నాయి. నాయుడు పేటకు హౌసింగ్ డిమాండ్ అవసరమవుతుందని చెప్పడానికి ఎంతో కాలం పట్టదు.

- భూమిపై పెట్టిన పెట్టుబడి కొద్దికాలంలోనే పదింతల ఆనందం ఇస్తుందని నమ్మకద్రోహం
- హైవే కు, రైల్వే ట్రాక్ కు ఆనుకుని వెలసిన టౌన్ షిప్
- 100% క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్ అంటూ ప్లాట్స్ అడ్డదారిలో అమ్మకం
- అటకెక్కిన అనుమతులు.. కానరాని బఫర్ జోన్లు
- అభివృద్ధికి నోచుకోని లే అవుట్.. కానరాని కనీస సౌకర్యాలు
- ఖాతాదారులకు బలవంతాన ప్లాటులు అమ్మకం
- న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఏజెంట్లు, ఖాతాదారులు వేడుకోలు

**(నెల్లూరు - మనసులో మాట)**

గ్లాస్, ఎలక్ట్రికల్, స్టీల్, టైర్, లెదర్ ఇంకా మరెన్నో ఇండస్ట్రీస్ నాయుడుపేట ఎస్ఇ జెడ్ కు రానున్నాయి. రాష్ట్ర అభివృద్ధి అంతర్జాతీయ స్థాయిని దాటుతుంది. రోజురోజుకూ పెరిగే భూమి విలువతో మీరు భూమిపై పెట్టిన పెట్టుబడి పదింతలు ఆనందాన్ని ఇస్తుంది. హైవేను ఆనుకుని వెల్ఫేర్ టౌన్ షిప్ నాయుడుపేటలో వెలసింది. నేడే మీ ప్లాటును బుక్ చేసుకోండి. వెల్ఫేర్ టౌన్ షిప్ కు అతి దగ్గరగా మార్కెట్, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ ఉన్నాయి. 40 నిమిషాల్లో తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు చేరుకోవచ్చు. 2 గంటల్లో మెట్రో సిటీ చెన్నైకు, 30 నిమిషాల్లో శ్రీకాళహస్తి దేవాలయానికి వెళ్లవచ్చు. 45 కి.మీ. కృష్ణపట్నం పోర్ట్, 30 కి.మీ.లలో గూడూరు రైల్వే స్టేషన్ ఉన్నాయి. డి.టి.పి.సి. నార్మ్స్ ప్రకారం లే అవుట్ నిర్మాణం, 40 33 అడుగుల అంతర్గత రోడ్, విద్యుత్ లైన్లు, లే అవుట్ చుట్టూ ఫెన్సింగ్, ఆకర్షణీయమైన ట్రీ గార్డ్స్, ఎవెన్యూ ప్లానిటేషన్, పూర్తి వాస్తు తక్షణ నివాసానికి

..మిగతా 16లో




# స్వాతంత్ర్య దినోత్సవం–2026 వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

- దేశ నిర్మాణంలో భాగస్వాములు" ప్రచారంతో ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా తీర్చిదిద్దాలి
- ఆగస్టు 10 నుంచి 15 వరకు విస్తృతంగా ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

**తిరుపతి బ్యూరో, ఆగస్టు 10 (మనసులో మాట) :**

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "దేశ నిర్మాణంలో భాగస్వాములు (పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్)" ప్రచార కార్యక్రమాన్ని జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో

..మిగతా 12లో

# చంద్రగిరిలో ఎగసిపడ్డ 'జనాగ్రహం'..!



# రాజగోపాలపురం గ్రామస్తులకు దాహం--- దాహం

**సత్యవేడు ఆగస్టు10(మనసులో మాట):**

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వసతిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షల రూపాయలను వెచ్చిస్తోంది.ఈ నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయడంతో పాటు మోటారు బిగింపుతో మంచినీటి పథకాలకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసింది.అయితే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగునీరు సరఫరా అవుతున్న బోర్లు కొన్నింటిలో చుక్క నీరు కనిపించకపోవడంతో పంచాయతీ కొళాయిలు ద్వారా తాగునీటిని సరఫరా చేయాలనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇందుకు సత్యవేడు మండలం రాజగోపాలపురం గ్రామంలో అస్తవ్యస్తంగా మారిన తాగునీటి సరఫరా నిదర్శనంగా నిలుస్తుంది. గ్రామంలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే ఇందులో 15 సంవత్సరాల క్రితమే నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు పైకప్పు దెబ్బతిని కూలింది. దీంతో ప్రస్తుతం ఒక ఓవర్ హెడ్ ట్యాంకుకు మాత్రమే తాగునీటిని పంపింగ్ చేస్తున్నారు.అయితే ఎస్సీ కాలనీ,గ్రామంలో దాదాపు 500 కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది.ఈ క్రమంలో కొన్ని బోర్లకు డైరెక్ట్ పంపింగ్ కనెక్షన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ప్రస్తుతం బోర్లలో కూడా నీటి చుక్క కనిపించకపోవడంతో వారానికి ఒక్కరోజు కూడా గంటపాటు తాగునీరు సరఫరా కావడం





లేదని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. పైగా గతంలో ప్రత్యామ్నాయంగా ఊటగుంట ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది.దీన్ని గుర్తించి గతంలో ఊటగుంటకు చుట్టూ రాతితో రివైట్ మెంట్ చేయడానికి శ్రీకారం చుట్టారు. అయితే పనులు పూర్తి చేయకనే వదిలేశారు. ఇప్పటికి రివిట్మెంట్ కోసం తెచ్చిన రాళ్లు ఊటగుంట వద్ద వృథాగా పడి ఉన్నాయి. పైగా ఈ గుంట ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్న వీలు లేని పరిస్థితి ఏర్పడింది.దీంతో గ్రామంలో తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఐదు రోజులకు ఒక్కసారి కూడా పంచాయతీ కొళాయిలు ద్వారా తాగునీటి సరఫరా కాకపోవడంతో మహిళల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది.బిందెడు తాగునీటి కోసం మహిళలు పొలాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో దాహం దాహం అంటున్నారు.

గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చిన సంబంధిత పంచాయతీ అధికారులు కానీ,ఆర్డబ్ల్యూఎస్ అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు.గ్రామంలో నీటి లభ్యత ఉన్న ప్రాంతాన్ని గుర్తించి కొత్తగా బోర్లు వేసి విద్యుత్ మోటారు బిగించడంతోపాటు కొత్తగా ఓవర్హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టాలన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తం అవుతుంది. పైగా రాజగోపాలపురం గ్రామంలో తాగునీటి కోసం మహిళలు బిందెలతో పరుగులు తీస్తుంటే నిధులను వెచ్చించడంలో ఇటువంటి వాటికి ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి తద్భిన్నంగా దాసుకుప్పం ప్రాంతంలో దాదాపు 15 లక్షల రూపాయలతో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంలో ఆంతర్యం ఏమిటో బోధపడటం లేదు.పైగా ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏదైనా సరే తాగునీటి సరఫరాను మెరుగుపరచడానికి మొదటి ప్రాధాన్యతగా ఉంటుందనుటలో సందేహం లేదు. రాజగోపాలపురం గ్రామంలో గుక్కెడు తాగునీటి కోసం అవస్థలు పడుతున్న సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్య ధోరణిపై విమర్శలు వినిపిస్తున్నాయి.గుక్కెడు తాగునీళ్లు ఇవ్వండి మహాప్రభో అంటూ మహిళలు అధికారులను అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తలెత్తిన తాగునీటి ఎద్దడిని తొలగించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు పంచాయతీ కొళాయిలు ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేల చూడాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు.

# మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



- **డీఎస్సీ అక్రమాలపై లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్ఆర్సిపి నాయకులు డిమాండ్**

**సూళ్లూరుపేట, ఆగస్టు 10(మనసులో మాట):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీఎస్సీ లీకు అక్రమాలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్ఆర్సిపి శ్రేణులు నాయకులు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ లో కొత్త జీవోలను విడుదల చేసి వెంటనే ఆ జీవోలను రద్దు చేశారని, యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ తో అడుగులు వేసిన వాళ్లకు డీఎస్సీలో ఉద్యోగాలు ఇచ్చేందుకు ఈ స్కామ్ జరిగిందని తెలిపారు. ఈ డీఎస్సీలో అవకతవకులపై లోకేష్ రాజీనామా చేయకపోతే ఈ ర్యాలీలు, ధర్నాలు కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని కల్లబొల్లి మాటలు చెబుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరు ఆగదు : మాజీ ఎమ్మెల్యే





- **శ్రీకాళహస్తిలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :**

డీఎస్సీ2025 నియామకాల్లో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు, జెన్‌జెడ్ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో అర్హత లేని వారికి ఉద్యోగాలు కట్టబెట్టారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరి



పించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. అర్హత ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు, నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగుతుందని మధుసూదన్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ నాయకులు, మహిళా, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యానాదుల స్మశానాలను కూడా వదలని భూకబ్జాదారులు : సీపీఐ



**శ్రీకాళహస్తి రూరల్, ఆగష్టు 10 (మనసులో మాట) :**

యానాదుల స్మశాన భూములను ఆక్రమణల నుంచి కాపాడి, వారికి అప్పగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలో సీపీఐ చేపడుతున్న పాదయాత్రలో భాగంగా ముళ్లపూడి గిరిజన కాలనీలోని యానాదుల స్మశానాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసి రాజన్ మాట్లాడుతూ.. యానాదుల స్మశానాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అనేక యానాది కాలనీల్లో కనీస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముళ్లపూడి గిరిజన కాలనీలోని స్మశాన భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి, ఆక్రమణలను తొలగించి యానాదులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్మశానానికి రహదారి, నీటి వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, తొట్టంబేడు మండల కార్యదర్శి రుద్రపాక శ్రీనివాసులు, నాయకులు రాజయ్య, మనీ, మహిళలు పాల్గొన్నారు.

## పట్టాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలని
# సీపీఎం నిరసన



**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :**

తొట్టంబేడు మండలం చేమూరు గ్రామంలోని దళితుల భూ పట్టాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం నాయకుడు గురవయ్య మాట్లాడుతూ.. 2006లో 50 మంది దళితులకు 100 ఎకరాలకు పైగా భూమిని పంపిణీ చేసి పట్టాలు అందించారని తెలిపారు. వీరిలో 35 మంది పట్టాలు ఆన్లైన్‌లో నమోదు చేసినప్పటికీ పదేళ్ల తర్వాత తొలగించారని ఆరోపించారు. ప్రస్తుతం తెలుగు గంగా నీటితో భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు ఆన్లైన్‌లో లేకపోవడంతో రైతు సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దళితుల పట్ల అధికారులు చిన్నచూపు చూడటం తగదని, వెంటనే పట్టాలను ఆన్లైన్‌లో నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వైభవంగా శ్రీ చంగల్రాయస్వామి వారి వసంతోత్సవం



**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలోని శ్రీ శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ చంగల్రాయస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మూడో గేట్ సమీపంలోని వసంత మండపం వద్ద శ్రీ చంగల్రాయస్వామి వారికి వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వసంత మండపం వద్ద ఉత్సవ మూర్తులకు ప్రత్యేక సేవలు చేపట్టి, సంప్రదాయబద్ధంగా వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడి, మంగళవాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వసంతోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, ఉత్సవ సేవలను భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకిస్తున్నారు. శ్రీ చంగల్రాయస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి.

# కేవీ పల్లిలో వైసీపీ ర్యాలీ విజయవంతం





- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి..
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి – నిరుద్యోగ భృతి ₹3 వేలు చెల్లించాలి...
- పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**కేవీ పల్లి ఆగస్టు 10 మనసులో మాట :**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తూ, నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు.కూటమి ప్రభుత్వంలో విద్యా, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం కేవీ పల్లి మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులు, యువత సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, అదే స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపించిన చింతల రామచంద్రారెడ్డి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు.విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కేవీ పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిత్రుడి ఆపదలో అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు





- హైదర్‌వలికి రూ.50 వేల ఆర్థిక సాయం.. మానవత్వం చాటుకున్న 1991–92 బ్యాచ్

**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట)**

ఆపదలో ఉన్న చిన్ననాటి మిత్రుడికి అండగా నిలిచి ముదిగుబ్బ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న తమ స్నేహితుడు ఎం. హైదర్‌వలి ప్రమాదానికి గురై ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

**విద్యుత్ షాక్‌తో ప్రమాదం..**

ముదిగుబ్బకు చెందిన ఎం. హైదర్‌వలి ప్రస్తుతం అనంతపురంలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు రెండు నెలల క్రితం సెంట్రింగ్ పని చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ షాక్ కారణంగా భవనం పైనుంచి కిందపడటంతో వెన్నుముకకు తీవ్ర గాయమైంది. ఈ ప్రమాదం తర్వాత హైదర్‌వలి నడవడానికి, ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో గతంలో మాదిరిగా సెంట్రింగ్ పనులకు వెళ్లలేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

**స్నేహితుడి పరిస్థితి తెలుసుకుని..**

తమతో కలిసి పదో తరగతి చదువుకున్న హైదర్‌వలి ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అతని పూర్వ విద్యార్థి మిత్రులు చలించిపోయారు. చిన్ననాటి స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆపదలో ఉన్న మిత్రుడికి తమవంతు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి రూ.50 వేల నగదును సమకూర్చారు.

**అనంతపురం వెళ్లి నగదు అందజేత**

పూర్వ విద్యార్థులు స్వయంగా అనంతపురం వెళ్లి హైదర్‌వలిని పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, చికిత్సతో పాటు కుటుంబ అవసరాలకు ఉపయోగపడేలా రూ.50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తనను చిన్ననాటి మిత్రులు ఆదుకోవడం పట్ల హైదర్‌వలి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రోజుల్లో ఏర్పడిన స్నేహబంధం సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరలేదని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

**మిత్రత్వానికి నిదర్శనం**

సాధారణంగా పాఠశాల విద్య పూర్తయిన తర్వాత ఎవరికి వారు తమ జీవితాల్లో స్థిరపడిపోతుంటారు. అయితే మూడు దశాబ్దాలకు పైగా గడిచినప్పటికీ తమ స్నేహితుడి కష్టాన్ని తమ కష్టంగా భావించి సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందించడంతో పాటు హైదర్‌వలికి ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫకృద్దీన్, భాష, నాగేంద్ర, సుధాకర్, జగన్, హయత్, సురేష్, బాబు, ఫణి, సుధీర్, పుల్లారెడ్డి, గంగాధర్, కృష్ణ, షాషావలి, నాయుడు, నర్సింహులు, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు. తమ స్నేహితుడి కష్ట సమయంలో స్పందించి ఆర్థిక సహాయం అందించిన పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.

మనసులో మాట

# ఆమెరికాతో స్నేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

- అందరికీ కనీస వేతనం రూ.31 వేలు ఇవ్వాలి.
- 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి
- స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి
- కౌలు, రైతులకు గుర్తింపు , పంట రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**పీలేరు ఆగస్టు 10 మనసులో మాట :**



ఆమెరికాతో స్నేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని, అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం పెంచి మద్దతు ధర ఇవ్వాలని, అందరికీ కనీస వేతనం రూ.31 వేలు ఇవ్వాలని. 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని. సేమ్ వర్వర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం నాయకులు మనోహర్ రెడ్డి టి.ఎల్ వెంకటేష్ కౌలు రైతుల సంఘం నాయకులు రమేష్ బాబు డిమాండ్ చేశారు.సోమవారం కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు జైల్ భరో నిరసన కార్యక్రమం సందర్భంగా పీలేరు క్రాస్ రోడ్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల సమస్య ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్న నిరసిస్తూ 9న క్విట్ ఇండియా దే సందర్భంగా కార్పొరేట్ హాటాఓ దేశ్ కో భచాఓ నినాదంతో నేను భారతదేశ వ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం, పరాయి పాలనకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం ఏ విధంగా జరిగిందో అదే స్ఫూర్తితో నేడు దేశంలో పెరిగి పోతున్న కార్పొరేట్ కంపెనీల కబంధహస్తాల నుంచి విముక్తికోసం, ప్రభుత్వ రంగ సంస్థలను వర్క్‌ప్లేస్‌లో నిలబెట్టేందుకు చేపట్టే కార్పొరేట్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు.బ్యాంకులలో లక్షల కోట్లు రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందించినా 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్లు రూపాయలను రైటాఫ్ పేరుతో మాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగ అప్పులతో కూరుకు పోయి అత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రూపాయలు మాఫీ చేయడం కాదు, రైతుల రూపాయలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చమురు ఆధారా, గరిజనులు అన్ని భూములపై పట్టుకున్న హరిత్తు రాజ్యం అటవీ చట్టానికి సవరణ పాస్ చేయని విమర్శించారు.ఈ చర్యలకు కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మార్గన పుత్రుడు గౌతమ్ అదానీ ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డారన్నారు. సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు జీఎస్టీ, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ టాక్సులపై లక్షలాది, కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్నదని విమర్శించారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు.కార్పొరేట్ల లాభాలకు పెంపు ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని నిరుపయోగంగా జిల్లాజిల్లా బిల్లులను తీసుకొచ్చి వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేసిందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనిపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సీఐటీయూ జి ల్లా ఉపాధ్యక్షులు ఓబుళమ్మ ప్రభావత్తమ్మ, వ్యవసాయ కార్మికులు నరసింహులు రమణ జయన్న దేవా అక్బర్ చంద్రశేఖర్ పద్మజ సుమలత సిద్దమ్మ శారద లు పాల్గొన్నారు.రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 31వేలు అమలు చేయాలని, ఆటో, హమాలీ వర్కర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నర్సింహులు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత,సిఐటియు నాయకులు దేవసేన,భూకైలేశ్వరి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.వి రమణ, యశోదమ్మ, దామోదర్, నజీర్, కిరణ్ మహిళా సంఘం నాయకురాలు బేబీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ పేరుతో మోసపూరిత ఫోన్ కాల్స్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

- చెన్నూరు మండల విద్యుత్ అధికారి, రామలింగారెడ్డి

**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు,10:**



చెన్నూరు మండలంలో విద్యుత్ శాఖ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ శాఖ అధికారి రామలింగారెడ్డి సూచించారు. సోమవారం చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని, డబ్బులు చెల్లిస్తే మీటర్లు మారుస్తామని, బిల్లులు తగ్గిస్తామని చెప్పి రూ.5 వేలు, రూ.10 వేలు తదితర మొత్తాలను ఫోన్‌పే, యూపీఐ ద్వారా చెల్లించాలని కొందరు వ్యక్తులు ఫోన్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వారి మాటలు నమ్మి కొంతమంది వినియోగదారులు డబ్బులు కోల్పోయారని పేర్కొన్నారు.విద్యుత్ శాఖ అధికారులు వ్యక్తిగత ఫోన్ కాల్స్ చేసి డబ్బులు చెల్లించాలని కోరరని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దన్నారు. విద్యుత్ బిల్లులను అధికారిక డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారానే చెల్లించాలని కోరారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ



- సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్
- డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్

**రాయచోటి ఆగస్టు 10 మనసులో మాట :**

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి వాస్తవ్యులు కీ:శే: పాలగిరి దస్తగిరి 7 వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె నాగేశ్వరి గారి ఆర్థిక సహాయం తో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు బెడ్లు పంపిణీ చేయడం జరిగిందని డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్. మహమ్మద్ తెలిపారు.అనంతరం దాత నాగేశ్వరి గారు మాట్లాడుతు ఈ రోజు మా తండ్రి కి:శే:పాలగిరి దస్తగిరి గారి 7 వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు చేస్తున్న సేవలను చూసి నా వంతుగా ప్రజలకు సేవ చేయాలని ఈ రోజు రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ వి.హరీష్ చంద్ (బబ్లూ), డా.ధరణి కుమార్,వినోద్ కుమార్ నాయక్,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# కొత్త గ్రామీణ ఉపాధి చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్

- ఉపాధి హామీ పనిదినాలు 100 నుంచి 125 రోజులకు పెంపు

**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట):**



ముదిగుబ్బ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వికసిత భారత్-ఉపాధి హామీ జీవనోపాధి మిషన్ (గ్రామీణ) చట్టంపై పంచ సమ్మేళన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందికి కొత్త చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం-2025ను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టానికి 2025 డిసెంబర్ 21న రాష్ట్రపతి ఆమోదం లభించిందని, 2026 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు.కొత్త చట్టంపై గ్రామీణ ప్రజలు, గ్రామ ప్రధానులు, పంచాయతీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా పంచ సమ్మేళన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే కోడూరు నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనిదినాలను గతంలో ఉన్న 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. గ్రామాల్లో నీటి వనరుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, పాడి పరిశ్రమ, పశుపోషణ, గ్రామీణ గిడ్డంగుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నాయని ఎంపీపీ తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.7,700 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య, విద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌లకు ముదిగుబ్బ మండలం తరఫున ఎంపీపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హాజీవలి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి మంజుల, ఏపీవో గోపాల్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటిలో హెచ్ఐవీపై అవగాహన
# పోస్టర్లు ఆవిష్కరణ



**రాయచోటి ఆగస్టు 10 మనసులో మాట :**

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే ఐఇసి పోస్టర్లను రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు సోమవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీయస్ఏసియస్), దిశ ప్రోగ్రామ్ సమన్వయంతో ప్రజా చైతన్య సేవా సంఘం (పిసిఎస్ఎస్) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ ఎల్.రాధిక మార్గదర్శకత్వంలో హెచ్ఐవి నివారణ, పరీక్షలు, సకాలంలో చికిత్స, చికిత్సా సేవలకు అనుసంధానం, అపోహలు, వివక్ష నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రాష్ట్రస్థాయిలో నిర్వహించే '95:95:99' ఐఈసీ ప్రచారంలో భాగంగా అన్నమయ్య జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఈకార్యక్రమం లో పీసిఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.చెన్నారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి, ఐసీటీసీ కౌన్సిలర్ ఉమాదేవి, ఎల్డబ్ల్యూఎస్ సిబ్బంది హరి, అశ్వని తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీకి కొత్త రూపం..
# 125 రోజులకు పెంపు



**ధర్మవరం ఆగస్టు 10 (మనసులో మాట):**

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలం రావులచెరువు పంచాయతీలో వికసిత్ భారత్ జీ-రామ్-జీ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను అధికారులు సోమవారం పరిశీలించారు. దేవరకొండ ప్రాంతంలో పనులు చేస్తున్న కూలీల వద్దకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్ చేరుకుని పనులను పర్యవేక్షించారు. అనంతరం టెక్నికల్ అసిస్టెంట్ వెంకటకృష్ణ పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పథకంలో జరిగిన మార్పులు, కూలీలు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. 2026 జూలై 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చిందని, గతంలో ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. ప్రతి కూలీకి రోజుకు రూ.312 కూలి లభిస్తుందని చెప్పారు. కూలీల హాజరు నమోదు కోసం రోజుకు రెండుసార్లు ఫొటోలు తీయాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 7 గంటలకు ఒకసారి, నాలుగు గంటల అనంతరం మరోసారి ఫొటోలు తీసి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే కూలి జమలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

# కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రతిఘటన





- **ధర్మవరంలో జైల్‌భరో.. కార్మిక సంఘాల నేతల అరెస్టు, విడుదల**

**ధర్మవరం ఆగస్టు10 (మనసులో మాట):**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్మవరంలో సోమవారం జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేపట్టారు.కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకుడు ఎస్.హెచ్.భాషా మాట్లాడుతూ.. కార్మికులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.31 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే 12వ పీఆర్సీ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను చెల్లించాలని కోరారు.రైతుల పంటలకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. కనీస పింఛన్‌ను రూ.9 వేలకు పెంచాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజువారీ వేతనం రూ.700గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, పంట నష్టపరిహారం అందించాలని, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులు, రైతుల ప్రయోజనాలను విస్మరిస్తోందని నాయకులు విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించి కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, రవాణా రంగ నాయకులు ఎస్.రఫీ, ముదిగుబ్బ సీఐటీయూ కన్వీనర్ బాబ్జాన్, మిడ్‌డే మీల్స్ జిల్లా కార్యదర్శి నారాయణ, అంగన్‌వాడీ నాయకులు సరస్వతి, చంద్రకళ, విజయ, దినా, అరుణ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, ముకుంద, సివిల్ సప్లై హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి బాలు, అంగన్‌వాడీ నాయకులు భారతి, లక్ష్మి, ఆశా సంఘం నాయకురాలు రజియా, చేనేత కార్మిక సంఘం నాయకులు ఖాదర్‌భాషా, గుంపు హరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాయచోటిలో నిరసన

- **మున్సిపల్ కార్యాలయం నుంచి అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ.**
- **ప్రజా సమస్యల పరిష్కారానికి కార్మిక, రైతు సంఘాల డిమాండ్.**



**రాయచోటి ఆగస్టు 10 మనసులో మాట :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాయచోటిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో, నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాయచోటి మున్సిపల్ కార్యాలయం నుంచి అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో నాయకులు ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ర్యాలీనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతులపై పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించి, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కష్టాల కడలిలో ఉన్న రైతులకు రెండు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి ఆదుకోవాలని రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని కార్మిక సంఘాల నాయకులు ధర్నానుద్దేశించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచే విధానాలను ఉపసంహరించుకోవాలని, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. రైతులు, కార్మికులు, కూలీలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం, ఎ ఐ టి యు సి, వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాయచోటి ప్రాంతంలోని రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను కూడా నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

మనసులో మాట

# చెట్లు ఇచ్చే ప్రాణవాయువుతోనే భూమిపై మన జీవనం




- నాగమణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీపురం సీతారామయ్య

**పలమనేరు ఆగస్టు 10( మనసులో మాట ) :**

చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 1న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పలమనేరు జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సోమవారం బహుమతులు అందజేశారు. నాగమణి చారిటబుల్ ట్రస్ట్, గురు శిష్యుల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన 'విద్యార్థి ప్రగతి పథం' కార్యక్రమంలో భాగంగా 10 మంది విజేతలకు బహుమతులు, మరో 11 మంది విద్యార్థులకు కన్సొలేషన్ ప్రైజులు అందించారు. గురు శిష్యుల చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థినులు ధైర్యంగా విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నాగమణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ గురు-శిష్యుల అనుబంధం గొప్పదన్నారు. చెట్లు అందించే ప్రాణవాయువు వల్లే మన జీవనం సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సబ్జు సాహెబ్, ఉపాధ్యాయులు, సీఆర్పీ అనిల్‌కుమార్, విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో 37 మందికి ఉచిత దంత వైద్యం..



**చిత్తూరు, ఆగస్టు 10 ,(మనసు లో మాట) :**

దంత సమస్యలతో బాధపడుతున్న పేదలకు అండగా నిలుస్తూ అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. అమ్మఒడి ట్రస్ట్ ఫౌండర్ చెరుకూరి పద్మనాభ నాయుడు ఆధ్వర్యంలో దంతములు లేని 37 మందిని చెన్నైలోని చెట్టినాడు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చెన్నైకి వెళ్లే రోగులకు భాస్కర హోటల్ అధినేత ఎన్.పీ. జయప్రకాష్ ఆహారాన్ని పంపిణీ చేశారు. సేవా కార్యక్రమానికి మేనకా హోటల్ అధినేత ఎన్.పీ. జయచంద్ర నాయుడు, రామభద్ర నాయుడు, బాను తదితరులు సహకరించారు. అమ్మఒడి సభ్యులు వెంకటేష్ బాబు, మురళి, మనోజ్, గణేష్, వాసు, పృధ్వీ, చండీప్రభ, మధు ఆచారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు దంత వైద్యం అందించేందుకు 37 మందిని చెన్నైకి తీసుకెళ్లి సేవలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అమ్మఒడి ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

# రాయచోటిలో యువగర్జన! డీఎస్సీ అక్రమాలు నిరుద్యోగ భృతి ఫీజు బకాయిలపై వైఎస్సార్‌సీపీ సమరశంఖం




- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- రాయచోటి వైఎస్ఆర్ సిపి కార్యాలయం వద్దే కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగ యువత
- డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ జరపాలి
- హామీలను అమలు చేయాలిఅంటూ హోరెత్తిన నినాదాలు

**రాయచోటి ఆగస్టు 10 మనసులో మాట :**

డీఎస్సీ2025 నియామకాల్లో అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని స్పోర్ట్స్ కోటాలో అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని.. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాయచోటిలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటకు యువత భారీగా కదిలింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించ తలపెట్టిన భారీ శాంతియుత ర్యాలీకి నియోజకవర్గం నలుమూలల నుంచి విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, యువజన సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రాంగణం యువశక్తితో కిక్కిరిసిపోయింది. ర్యాలీగా బయలుదేరేందుకు సిద్ధమైన సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కేవలం 20-30 మంది మాత్రమే ర్యాలీలో వెళ్లాలని పోలీసులు ఆంక్షలు విధించడంతో యువత, విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ర్యాలీకి వచ్చిన వారంతా కార్యాలయం వద్దే బైఠాయించి ప్రభుత్వ విధానాలపై పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, డిమాండ్లతో కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది.

**డీఎస్సీ-2025పై సీబీఐ విచారణకు డిమాండ్:**

డీఎస్సీ2025 నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.మెరిట్‌తో ఉద్యోగం ఆశించిన నిరుద్యోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదు.. నియామకాల్లో పారదర్శకతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.



**నిరుద్యోగ భృతిపై నిలదీత:**

ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు విమర్శించారు. నిరుద్యోగ భృతి అమలులో జాప్యంపై యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయడంతో పాటు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి వేగంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు కాలయాపన కాకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి అని కోరారు.

ఫీజు బకాయిలతో విద్యార్థుల అవస్థలు:

విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగేలా ప్రభుత్వం వ్యవహరించకూడదు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి" అని డిమాండ్ చేశారు.

**రాయచోటినే జిల్లా కేంద్రంగా పునరుద్ధరించాలి:**

రాయచోటిని జిల్లా కేంద్రంగా పునరుద్ధరించాలన్న డిమాండ్ కూడా నిరసనలో ప్రధానంగా వినిపించింది. రాయచోటి జిల్లా కేంద్రం విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని నాయకులు ఆరోపించారు. రాయచోటినే జిల్లా కేంద్రంగా పునరుద్ధరించి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు.

**హామీలు ఎక్కడ? సమాధానం చెప్పండి!:**

ఎన్నికల ముందు యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

డీఎస్సీ అక్రమాలపై విచారణ ఎప్పుడు?

నిరుద్యోగ భృతి ఎప్పుడు?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు..?

రాయచోటి జిల్లా కేంద్రం ఎప్పుడు?అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పష్టం చేశాయి.

**పోరుబాటకు భారీ స్పందన:**

వైఎస్సార్‌సీపీ పిలుపుతో రాయచోటి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. యువత పెద్దఎత్తున తరలిరావడంతో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ మాజీ చైర్మన్ ఫయాజ్ బాష,వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్ఆర్ సిపి స్టేట్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మండలాల కన్వీనర్లు నవాజ్, మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, గడికోట జనార్దన రెడ్డి,ఉదయ్ కుమార్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, వైఎస్ఆర్ సీపీ జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, యువజన విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు మడితం రెడ్డి కుమార్,ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా అంజనప్ప ,బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, నియోజక వర్గ ఎస్ సి సెల్ అధ్యక్షుడు సగినాల శివ శంకర తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి యువత,విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# ఒక్క నీటి బొట్టూ వృథా కానివ్వం! సాగునీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- సోమశిల, కండలేరు నీటి నిల్వలు, వినియోగంపై సమీక్ష
- కావలి కాలువ అభివృద్ధి, విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి
- నార్త్ ఫీడర్ కెనాల్‌లో జికేఎన్ పనులు పూర్తి చేసి ఈ సీజన్‌లోనే పంటలకు నీరు



**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 10, మనసులో మాట:**

జిల్లాలో సాగునీటి వినియోగంలో అత్యంత జాగ్రత్త వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని సద్వినియోగం చేయాలని స్పష్టం చేశారు. నగరంలోని సంతపేటలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సాగునీటి ప్రాజెక్టులు, సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు, వినియోగం, పంటల రక్షణపై మంత్రి ఆనం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో ఉన్న ఆయకట్టు, పంటలకు అవసరమైన నీటి పరిమాణం, ఇప్పటివరకు వినియోగించిన నీటి వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటిని రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి ఆనం హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో సాగునీటి వృథాను ఏమాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సూచనల మేరకు కావలి కాలువ అభివృద్ధి, విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే నార్త్ ఫీడర్ కెనాల్ పరిధిలోని జికేఎన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఈ సీజన్‌లోనే పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీటి లభ్యత, వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు.

# పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలి





- ఈరోజు నిర్వహించిన ఎస్ ఆర్. పురం నిర్వహించిన పిజి ఆర్ ఎస్ కార్యక్రమం నందు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 217 వినతలు స్వీకరించాం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు,ఆగస్టు 10 (మనసులో మాట) :**

కలెక్టరేట్ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు కలెక్టర్ నుంచి జిల్లా స్థాయి అధికారులందరూ హాజరవుతారు. అర్జీలు తీసుకుంటారు. మండల స్థాయిలో సమస్యలకు పరిష్కారం కాకపోవడంతో అత్యధికులు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఇలా వచ్చే వారి సంఖ్యను తగ్గించడానికి.. మండలాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించేలా కలెక్టర్ సుమిత్ కుమార్ చర్యలు చేపట్టారు.సోమవారం స్థానిక ఎస్ ఆర్ పురం మండలం లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లకు ఎక్కువ శాతం రెవెన్యూ సంబంధిత శాతం అర్జీలు వస్తున్నాయని, అందులో మండల స్థాయిలో పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ ఆర్ పురం మండలంలో ఎంపిడిఓ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్థానిక జిడి నెల్లూరు శాసన సభ్యులు ప్రభుత్వ విప్ వి.యమ్ థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వినతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. రాజేంద్రన్, డి ఆర్ ఓ మోహన్ కుమార్, ట్రైనింగ్ కలెక్టర్ వెంకటేష్ చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలని అయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గడువు ముగిసేలోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం నందు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 217 వినతలు స్వీకరించారు. రెవెన్యూ 114, పోలీస్ 25, సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 14, విద్యుత్ శాఖ 6, పంచాయత్ రాజ్ ఇంజనీరింగ 6, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 5, పంచాయత్ రాజ్ 5, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 5, స్కూల్ ఎడ్యుకేషన్ 3, సమగ్ర శిక్ష అభయాన్ 2, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ 2, రూరల్ డెవలప్మెంట్ 1, విభిన్న ప్రతిభ వంతులు 1, అనిమల్ హస్బండ్రీ 1, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు 1, పబ్లిక్ హెల్త్ 1, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ 1, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ ఫుడ్ సేఫ్టీ 1, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ 1, సైనిక్ వెల్ఫేర్ 1, పెన్షన్ ఆఫ్లైన్ 21, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిడి నెల్లూరు శాసన సభ్యులు ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ , డి ఆర్ ఓ, ఆర్డీ ఓ, కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో లోకనాథం పిళ్ళై, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి : ఏపీ రైతు సంఘం



**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :**

కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు సోమవారం శ్రీకాళహస్తిలో జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయాన్ని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు రైతులు, కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తిప్పి కొట్టాలని పుల్లయ్య పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.700 దినసరి వేతనం అందించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా అమెరికాతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా ఒప్పందాలను రద్దు పర్చాలని స్పష్టం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, వెంకటేష్, గురునాధం, రాజా, చుట్టు గురవయ్య, వసాయ కార్మిక సంఘం నాయకులు రమణయ్య, సుబ్బయ్య, జేకే రమణయ్య, రైతు సంఘం నాయకులు రంగయ్య, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



- జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 10, మనసులో మాట :**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్‌వో విజయకుమార్, వివిధ శాఖల అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సమస్యలు పరిష్కరించడంలో ముందుంటాం



**రాయచోటి ఆగస్టు 10 మనసులో మాట :**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడు ముందు ఉంటామని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ నవాజ్ షరీఫ్ అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలో ఎన్జీవో హోం జరిగిన ఏపిడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ అన్నమయ్య జిల్లా కమిటీ నాయకుల సమక్షంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయచోటి నియోజకవర్గ ఎన్నికను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడిగా నవాజ్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా బొక్కసం రెడ్డి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా లవ కుమార్, బిలాల్, వెంకట్రామరాజు, సహాయ కార్యదర్శిగా అహ్మద్ భాషా, ట్రెజరర్ గా గౌస్ మొహిద్దిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవికుమార్, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యలను ఎల్లవేళలా పరిష్కరిస్తూ కమిటీ బలోపేతం ముఖ్య ఉద్దేశం అన్నారు. జర్నలిస్టుల హక్కులు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలను ముందుండి పోరాడుతామని, జర్నలిస్టులకు ఇంటి పట్టాలు, తదితర సమస్యల పై నెల 23వ తేదీన మదనపల్లిలో జరిగే జిల్లా మహాసభను ఈ ఒక్క జర్నలిస్ట్ వెళ్లి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిజేఏ జిల్లా ప్రజలు కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ అస్లాం, రషీద్ తోపాటు అన్ని మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయండి



**పలమనేరు ఆగస్టు 10( మనసులో మాట):**

వల్లె వేయడం విద్య కాదు ప్రజ్ఞను పెంచేది విద్య గత 36 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయడానికి హైస్కూల్ పిల్లలకు జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షల గోడపత్రికను జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు సీతారామయ్యగారు ఆవిష్కరించారు. స్థానిక సాయిమేధ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ....'వల్లే వేయడం విద్య కాదు ప్రజ్ఞను పెంచేది విద్య' అలాంటి ప్రజ్ఞను వెలికి తీయడానికి చెకుముకి సంబరాలు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. నాలుగు స్థాయిలో జరిగే ఈ పరీక్షలు పాఠశాల స్థాయి ఆగస్టు 27న, మండల స్థాయి సెప్టెంబర్ 11న, జిల్లాస్థాయి సెప్టెంబర్ 27న రాష్ట్రస్థాయి నవంబర్ 1,2,3 తేదీలలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మిఠాయి యుగంధర్ బాబు, కోశాధికారి గిరిధర్ మూర్తి, మండల అధ్యక్షులు బాల చైతన్య , ప్రధాన కార్యదర్శి సుదర్శన ఆచారి, డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బాబు, ఉపాధ్యాయులు ఆనంద్ బెన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను దోచేస్తున్న గుజరాతీయులు

**ముత్తుకూరు. ఆగస్టు.10(మనసులో మాట):**




దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటినుండి నేటి వరకు దేశ సంపద అంతా గుజరాతీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షాలు అదే రాష్ట్రానికి చెందిన అదాని అంబానీల కు కట్టబెట్టేసారని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల సాయి ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 6 నుండి 15 వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో జీపు జాతాలు, పాదయాత్రలో నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే సోమవారం సర్వేపల్లి నియోజకవర్గంలోనీ ముత్తుకూరు మండలంలో గ్రామ గ్రామాన పర్యటించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ముత్తుకూరులో పాదయాత్రను ప్రారంభించి అనంతరం ఆయన బస్టాండ్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ 2014 ఎన్నికల ముందు తాము తిరిగి అధికారంలోకి వస్తే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకుని వచ్చి పేదల బ్యాంకు అకౌంట్లో వేస్తానని అందుకుగాను ముందుగా బ్యాంకు అకౌంట్ లేనటువంటి ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతాలు తెరవాలని చెప్పడంతో మోడీ మాటలను నమ్మిన ప్రజలు కనీసం బ్యాంకు లావాదేవీలు కూడా అవసరం లేనటువంటి వారు అనేకమంది బ్యాంకులలో అకౌంట్ చేసుకోవడం జరిగిందన్నారు. అయితే 2014 ఎన్నికల్లో గెలుపొంది నల్లధనాన్ని తీసుకురాకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అలాగే గత ఎన్నికల్లో కూడా నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతులకు గిట్టుబాటు ధర ఇప్పిస్తామని, మహిళలకు సప్త సభలో 33% రిజర్వేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నేటికీ ఇచ్చినటువంటి హామీ ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. గుజరాత్ కు చెందిన మోడీ అమిత్ షా తమ రాష్ట్ర వాసులను మాత్రమే అభివృద్ధి చేయాలన్న దురుద్దేశంతో అదే రాష్ట్రానికి చెందిన ప్రధాని, అంబానీలకు దేశ సంపద అప్పజెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికే దేశంలోని అన్ని ఓడరేవులను ఆదానికి ఇప్పించడం జరిగిందన్నరు. అలాగే అంబానీకి కూడా పలు సంస్థలను అప్పజెప్పడం జరిగిందన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలోని కృష్ణపట్నం పోర్టును అదానికి, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు పేరుతో రిలయన్స్ అధినేత అంబానీకి నాలుగు వేల ఎకరాలను అప్పనంగా అప్పజెప్పడం జరిగిందన్నారు. థర్మల్ ప్రాజెక్టు రానందున భూములన్ని బీడుగా మారిపోయాయని స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా తుంగలో తొక్కేసారన్నారు. అటు భూములు పోయి ఇటు ఉపాధి లేక స్థానికులు ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు ఇప్పటికే కొంతమేర అదానికి అప్పజెప్పడం జరిగిందని పూర్తిగా ఆయనకే ఇచ్చేందుకు మోడీ పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తానని ఉద్యోగ ఉపాధి కల్పిస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు అమరావతి అభివృద్ధి పేరుతో తీర్చలేనటువంటి విధంగా భారీగా అప్పులు చేసి అమరావతి నిర్మిస్తున్నారన్నారు. అలాగే ఇప్పటికే విదేశీ కంపెనీలను తీసుకుని వస్తున్నామని చెప్తున్నా నేటికీ అవి పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్రం ప్రస్తుతం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని చంద్రబాబు నేటికీ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని పేరు మార్చి జీవీబీ రాంజీ పేరుతో తీసుకురావడం కూలీలకు మరింత బాధాకరం కలిగించే విధంగా కండిషన్లు పెట్టడం వంటివి జరిగాయి అన్నారు. రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరనిర్ణయించే అధికారాన్ని అదానికి ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారని అయితే రైతులు ఢిల్లీలో సుమారు 2 ఏళ్లపాటు ఆందోళన ధర్నాలు నిర్వహించి రైతులకు వ్యతిరేకంగా తెచ్చినం మూడు చట్టాలను రద్దు చేయించారన్నారు. అలాగే ప్రశ్నాపత్రాలు లిక్ కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 26 మంది విద్యార్థులు ఆత్మ చేసుకోవడం జరిగిందని ఈ ఉద్యమం తీవ్రతం కావడంతో ఈ పరీక్షల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై విద్యార్థులు ఆందోళన చేయడంతో దిగుచున్న నరేంద్ర మోడీ సంబంధిత మంత్రిని తొలగించడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు బిజెపి అనేక పుట్రలో కుతంత్రాలు చేయడం జరుగుతుందని వాటిని చూసి మోసపోయి ప్రజలు అనేక సమస్యలు తెచ్చుకుంటున్నారని వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమానికి భారీ జనం రావాలని ఆయన కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో మార్పు రావాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం సర్వేపల్లి నియోజకవర్గం కార్యదర్శి తుంగ ఏడుకొండలు మాట్లాడుతూ జీబు జాత పాదయాత్ర ముత్తుకూరు నుండి మామిడిపూడి ,ముసునూరు వారి పాలెం, తాళ్లపూడి , నారికేల్లపల్లి, బ్రహ్మదేవం ,పంటపాలెం మీదుగా సాగిందని ఈ సందర్భంగా పలువురు తమ గ్రామంలో పేర్కొని పోయిన సమస్యలను అర్జీ రూపంలో జిల్లా కార్యదర్శి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలామోహన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు జిలా ని ఖాన్, మండల కన్వీనర్ ముజీబ్ భాష,స్థానిక పార్టీ నాయకులు వెంకట రమణయ్య, కాకి వెంకట శేషయ్య, బద్రి వెంకటేశ్వర్లు, ప్రసాద్, సూర్యనారాయణ, రొయ్యల బాబు, జాన్ మార్క్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసిన నూతన సీఐ అంకమ్మరావు

**వింజమూరు, ఆగస్టు 10 (మనసులో మాట)**



ఉదయగిరి సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బొప్పన అంకమ్మరావు సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐను ఎమ్మెల్యే అభినందించి, నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఉదయగిరి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ, ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వహించాలని, చట్టాన్ని ప్రతి ఒక్కరికీ సమానంగా అమలు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సీఐ అంకమ్మరావుకు సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకాంక్షించారు.

# పలమనేరులో వైఎస్సార్‌సీపీ పవర్ షో - డీఎస్సీ కుట్రపై సీబీఐ విచారణ జరపాలి

- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

**పలమనేరు ఆగస్టు 10( మనసులో మాట ):**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తున్న మెగా డీఎస్సీ నియామకాల వ్యవహారంలో భారీ కుట్ర జరిగిందని దీనిపై సమగ్రంగా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ చిత్తూరు జిల్లా పలమనేరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు . మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో పలమనేరు పట్టణంలో పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు.గుండుబావి నుంచి మార్కెట్ కమిటీ వరకు ర్యాలీ పలమనేరులోని గుండుబావి వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ.. రెక్మాన సర్కిల్, రంగమహల్ థియేటర్, బజార్ వీధి మీదుగా మార్కెట్ కమిటీ వరకు కొనసాగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



***ప్రధాన డిమాండ్లు:*** ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ.....కూటమి ప్రభుత్వం ప్రకటించిన 16 వేల ఉద్యోగాల డీఎస్సీ ప్రక్రియ వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందన్నారు. డీఎస్సీకి సంబంధించిన కీలక బాధ్యతలను ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి అప్పగించడం అతనికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఆ వివరాలను తొలగించడం వంటి పరిణామాలు తీవ్రమైన అనుమానాలకు తావిస్తున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. డీఎస్సీ అక్రమాలపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం**: శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తుంటే అనుమతుల పేరుతో పోలీసులు చివరి నిమిషంలో సెక్షన్ 30 అమలు చేసి ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేయడంపై వెంకటేగౌడ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ వద్ద వైఎస్సార్ విగ్రహం ఎదుట ఇతర పార్టీల కటౌట్లు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అధికార పార్టీకి, అధికారులకు హెచ్చరిక ఈ సందర్భంగా అధికార పక్షానికి, అధికారులకు ఆయన ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. "మీరు మాకు నేర్పిస్తున్నది మేము నేర్చుకుంటున్నాం.. సమయం వచ్చినప్పుడు అదే పద్ధతిలో సమాధానం చెప్తాం" అని హెచ్చరించారు. పార్టీలకు కొమ్ముకాసే అధికారులు కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని గుర్తుంచుకోవాలని, భవిష్యత్తులో ప్రతి చర్యకు బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో వైసిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రతి ఒక్కరికి చేతులెత్తి జోడించి నమస్కారాలు తెలిపారు.ఈ కార్యక్రమం కార్యకర్తల విజయం అని తెలిపారు. రోడ్డు పొడవునా వైయస్ జగన్ వైఎస్ జగన్ సీఎం అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**పలమనేరు ఆగస్టు 10 ( మనసులో మాట) :**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, పలమనేరు పురపాలక సంఘ కార్యాలయము నందు ప్రతి సోమవారము ఉదయము గం.9.30 నుండి మధ్యాహం గం. 1.00 ల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ )కార్యక్రమాన్ని నిర్వహించడము జరుగుచున్నది. అందులో భాగంగా తేది 10.08 .2026 న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు 12 వినతులు పలమనేరు మున్సిపల్ కమిషనర్ కమీషనర్ కే.లోకేశ్వర వర్మ స్వీకరించడము జరిగినదన్నారు. ప్రజారోగ్యము విభాగము 05 ఇంజనీరింగ్ విభాగము 05., రెవిన్యూ విభాగము 01, పెన్షన్ 01 మొత్తము 12 వినతులు అందినవని సదరు ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు పరిష్కరించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి పురపాలక సంఘము అందిస్తుందని కమీషనర్ లోకేష్ వర్మ తెలిపారు.

# భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి




- సీకేపల్లి పొజిషన్ సర్టిఫికెట్ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి
- ఆర్డీవోకు ఏపీ ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకుల వినతి

**ధర్మవరం ఆగస్టు 10 (మనసులో మాట):**

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం డివిజన్ పరిధిలో భూ సమస్యలు, రెవెన్యూ రికార్డుల్లో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశగాల వెంకటేష్ మాట్లాడుతూ.. చెన్నేకొత్తపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 263 బి2లోని మూడు సెంట్ల స్థలానికి 1991లో బోయ నరసింహులుకు ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. 1993లో ధర్మవరం జగజ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన గజ్జల ఓబిలేసు అగ్రిమెంట్ ద్వారా ఆ స్థలాన్ని కొనుగోలు చేసి అప్పటి నుంచి తన ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు.అయితే అదే స్థలానికి సంబంధించి అంకే అరుణ పేరుతో 2025 డిసెంబరు 15న తహశీల్దార్ కార్యాలయం నుంచి పొజిషన్ సర్టిఫికెట్ జారీ అయిందని, అనంతరం ఆమె కుమార్తె పూజిత పేరుతో డిసెంబరు 29న దానపత్రం రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వయస్సులకు సంబంధించిన వివరాలపైనా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

సీకేపల్లి వీఆర్వో నారాయణస్వామితో పాటు ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి తప్పు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ జారీ అయిందన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

**వైఎస్సార్ కాలనీ సమస్యపైనా విచారణ**

ధర్మవరం వైఎస్సార్ కాలనీలో శ్రీరాములు తన స్థలంలో నిర్మించుకున్న పునాదిని పక్క స్థలానికి చెందిన వెంకటేష్ అక్రమంగా జోక్యం చేసుకుని ధ్వంసం చేశారని నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో నిష్పక్షపాత విచారణ జరిపి బాధితుడికి రక్షణ కల్పించాలని కోరారు. వైఎస్సార్ కాలనీలో భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితుల సమస్యలను అధికారులు వివక్ష లేకుండా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. భూ వ్యవహారాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు ఆదినారాయణ, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు వనమాల ఆనంద్, గణేష్, ప్రదీప్, కళ్యాణ్, రాము, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ సభ్యుడు సీనా, బాధితులు నాగభూషణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ కోసం సెప్టెంబర్ 1న చలో విజయవాడ



**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :**

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి యువ కిషోర్, శ్రీకాళహస్తి అధ్యక్షుడు వి. గంగయ్య, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు డి. కాసిం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారం లోకి వచ్చిన ఏడాదిలోపు సీపీఎస్ ఉద్యోగులతో చర్చించి ఆమోద యోగ్యమైన పెన్షన్ విధానం తీసుకొస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. వెంటనే సీపీఎస్ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న తిరుపతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి ఎస్. విజయమ్మ, వైస్ ప్రెసిడెంట్ కాసిం, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్కే భాష తదితరులు పాల్గొన్నారు.

# రైలు పట్టాలపై గుర్తు తెలియని మృత దేహం



**బాలాయపల్లి(మనుసులో మాట):**

వెంకటగిరి _ గూడూరు రైల్వే మార్గం నిడిగల్లు రైల్వేస్టేషన్ స్టేషన్ సమీపం వద్ద ప్లాట్ ఫారం పై మొండేం, తల వేరు, వేరు పడి ఉండిన సంఘటన సోమవారం తెల్లవారి జోమన చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు కథనం మేరకు ఆదివారం అర్ధరాత్రి సుమారు 01:00 గంట సమయంలో నిడిగల్లు రైల్వే స్టేషన్ ప్లాట్ఫామ్ వన్ సౌత్ సైడ్ ఎండ్ దగ్గర రైలు పట్టాల మధ్యలో స్లీపర్స్ పై గుర్తుతెలియని సుమారు 40 సంవత్సరాలు వయసు గల మగ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని తల మొండెం వేరు పడి మృతి చెందడంతో గూడూరు రైల్వే, ఎస్ఎం గూడూరు జిఆర్పి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా గూడూరు ఎస్ హేచ్ ఓ హెడ్ కానిస్టేబుల్ కే. సుదర్శనరావు మృత దేహాన్ని గూడూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రీసర్వేకు సాంకేతిక ఊతం



- 18 మంది సర్వేయర్లకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 10, మనసులో మాట:**

జిల్లాలో రీసర్వే కార్యక్రమాలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక సహకారంలో భాగంగా సోమవారం నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో మొదటి విడతగా 18 మంది మండల భూ సర్వే అధికారులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే కార్యకలాపాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. భూ రికార్డుల డిజిటలైజేషన్, క్షేత్రస్థాయి సర్వే తదితర పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ల్యాప్‌టాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రీసర్వే కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డీఆర్వో విజయ్ కుమార్, సర్వే అండ్ భూ రికార్డుల శాఖ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ఆర్థిక భరోసా





- అత్యవసర వైద్య సహాయం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- జీడీ నెల్లూరు నియోజకవర్గానికి ఇప్పటివరకు రూ.6.50 కోట్ల వరకు మంజూరు
- జీడి నెల్లూరు ఎమ్మెల్యే వి.థామస్

**చిత్తూరు ,వెదురుకుప్పం, ఆగస్టు 10 (మనసులో మాట) :**

పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అనుకోని వైద్య ఖర్చులు, కుటుంబ సభ్యుల మృతి వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) ద్వారా సహాయం అందిస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నియోజక వర్గ శాసన సభ్యులు వి.థామస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు రూ.400 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఖర్చు చేస్తోందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలనే మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన వారు, అనుకోని ప్రమాదాలు లేదా కుటుంబంలో సభ్యుడి మృతి వంటి సందర్భాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వాన్ని సంప్రదించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల్లో ఏవైనా లోపాలు లేదా సందేహాలు ఉంటే వాటిని సరిచేసి అర్హులైన వారికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ శాసన సభ్యులు మాట్లాడుతూ. సీఎం రిలీఫ్ ఫండ్ అనేది ముఖ్యంగా పేదలకు చేరాల్సిన ఆర్థిక సహాయమని, అందువల్ల దీనిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం పొందిన నియోజకవర్గంగా జీడీ నెల్లూరు నిలిచిందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.6.50 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరు మండలాలకు సంబంధించి సుమారు రూ.47 లక్షల విలువైన మంజూరు చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల శకుంతల అనే యువతిని పాము కాటువేయడంతో ఆమెను సిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా, వైద్య చికిత్సకు సుమారు రూ.8 లక్షల వరకు బిల్లు అయినట్లు తెలిపారు. విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి, 24 గంటల్లోనే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.8 లక్షలను ఆసుపత్రికి జమ చేయించి ఆమెకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇదే విధంగా తన పదవీకాలంలో ఇప్పటివరకు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 43 మందికి ఎల్‌వీసీ (LVC) ద్వారా వైద్య ఖర్చులను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

**కుటుంబ సభ్యుడిని కోల్పోయిన కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం:**

నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బుజ్జి కుమార్తె గంగానదిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనలో, గత ఐదారు సంవత్సరాలుగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం కోసం ప్రయత్నిస్తున్నట్ల తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, చెక్కు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం బాధిత కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

**మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు**

నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించే అంశంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాల భవనాల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. దేవళంపేటలోని విలేజ్ క్లినిక్ శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించి, దాని అభివృద్ధికి సుమారు రూ.36 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ భవనం విషయాన్ని కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, దాని అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ యువతరానికి చెందిన అధికారిగా, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలోనే ఉత్తమంగా పనిచేస్తున్న కలెక్టర్లలో సుమిత్ కుమార్ ఒకరని అన్నారు.జిల్లాలో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కలెక్టర్ పని చేస్తున్నారని, ఆయన సేవలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కూడా ఆయనను రాష్ట్రస్థాయిలో సేవలు అందించేందుకు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. అయితే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి వెళ్లేలా మరికొంతకాలం ఇక్కడే కొనసాగాలని కలెక్టర్‌ను కోరారు.ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రజలకు సేవ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ప్రజలు చిన్నచిన్న సమస్యలపై పరస్పరం గొడవలు పడకుండా, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవడమే అభివృద్ధికి మార్గమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# బాల్య వివాహాలతో బాలికల భవిష్యత్తుకు ముప్పు

- ఎల్లంపల్లి గిరిజన కాలనీలో అవగాహన కార్యక్రమం

**శ్రీకాళహస్తి రూరల్, ఆగష్టు 10 (మనసులో మాట) :**



బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి బాలికలకు మెరుగైన భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ ప్రియాంక అన్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, కౌమార దశలో బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ కౌమార దశలో బాలికలు గర్భం దాల్చడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు విద్యకు దూరమై తమ భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బాలికల ఆరోగ్యం, మానసిక స్థితి, భవిష్యత్తుపై బాల్య వివాహాలు తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కారణంగా కొన్ని సందర్భాల్లో బాల్య వివాహాలు పరోక్షంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే బాల కార్మిక వ్యవస్థను అరికట్టవచ్చన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాల ల్లో చేరి విద్యావంతులయ్యేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్య ద్వారా బాలబాలికల్లో సామాజిక అవగాహన పెరిగి, వివక్షత, పేదరికాన్ని అధిగమించి భవిష్యత్తుపై సరైన ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. బాలికల విద్యను మధ్యలో నిలిపివేయకుండా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ విజయవాహిని కోఆర్డినేటర్ లక్ష్మీ, ప్రగతి సంస్థ కోకన్వీనర్ రామచంద్ర కిషోర్, బాలికలు, తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్ పోలమ్మ, ఆశా వర్కర్ రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 12 నెలలుగా జీతాలు లేవు.. ఎలా బతకాలి?

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి.. లేదంటే నిరవధిక సమ్మె
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు

**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట)**



తమకు రావాల్సిన 12 నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో త్వరలోనే నిరవధిక సమ్మెకు దిగుతామని ముదిగుబ్బ మండల గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నాయకుడు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా తమకు జీతాలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రస్తుతం దాదాపు 12 నెలల జీతాలు తమకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. నిత్యావసర ఖర్చులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు తీర్చుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. జీతాల కోసం పలుమార్లు అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోతోందని తెలిపారు. తరచూ ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తే తప్ప తమకు జీతాలు వచ్చే పరిస్థితి లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సరఫరా వంటి అత్యవసర సేవల్లో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరా అందించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాంటి కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని చల్లా శ్రీనివాసులు కలెక్టర్‌కు స్పష్టం చేశారు. కార్మికుల సమస్యపై సానుకూలంగా స్పందించి, పెండింగ్ వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# పరిమళ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన నివాళి

**నెల్లూరు జిల్లా బ్యూరో, ఆగష్టు 10(మనసులో మాట ):**

నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ నియోజకవర్గ ఇంచార్జి పరిమళ వెంకటేశ్వర్లు మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం నాడు గూడూరులో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు ఆయన భౌతిక కాయాన్నిసందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బాల గురువం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన చేసిన సేవలను, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరిమళ వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులురెడ్డి, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ దెయ్యాల కిరణ్ కుమార్, శ్రీకాళహస్తి నియోజవర్గ ఇన్చార్జ్ తపాల దామోదర్ రెడ్డి, తిరుపతి జిల్లా స్పోక్స్ పర్సన్ శీను గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఫయాజ్, సూళ్లూరుపేట నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆవుల రమణ. ఎస్సీ సెల్ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసుల శాఖ ప్రత్యేక కృషి..



**చిత్తూరు ఆగస్టు 10(మనసులో మాట):**

చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశాల మేరకు.. జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాషా, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్. షాను ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా మొత్తం బాధితుల సమక్షంలోనే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను సంప్రదించిన అడిషనల్ ఎస్పీలు.. ఫిర్యాదులపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అందిన ఫిర్యాదుల్లో వేధింపులు, భూ తగాదాలు చెరో 9, ఆస్తి తగాదాలు 6, కుటుంబ తగాదాలు 5, డబ్బు తగాదాలు 5, ఇంటి తగాదాలు 4, చిన్న తగాదాలు 2, బెదిరింపులు 2, పోలీసు సేవలకు సంబంధించి ఒక ఫిర్యాదు, ఉన్నాయి. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా.. ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

## రాఖీ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



- గిరిజన మహిళలకు అండగా విజయ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్

**బత్తలపల్లి, ఆగస్టు 10: (మనసులో మాట):**

రాఖీ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన విజయ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు విజయ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో బత్తలపల్లి మండలం పత్యాపురం తండాలో గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గిరిజనులకు అత్యంత ప్రాముఖ్యమైన రాఖీ పండుగ సందర్భంగా గ్రామంలోని సుమారు 100 మంది మహిళలకు చీరలు అందజేశారు.ఈ సందర్భంగా విజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ.. పండుగలను పురస్కరించుకుని పేద, గిరిజన కుటుంబాలకు తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడమే తమ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. అనంతరం పత్యాపురం తండాలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ, సంతు సేవాలాల్ దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించడం పట్ల గ్రామస్తులు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాంజి నాయక్, హనుమంతు నాయక్, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యువ రాజకీయ నాయకుల సంభాషణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట):**

భారతీయ జనతా పార్టీ యువమోర్చా ముదిగుబ్బ మండల అధ్యక్షుడు శివకుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించనున్న 'వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్ డైలాగ్' కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముదిగుబ్బ ఎంపీపీ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, రాజకీయాల్లో యువత చురుకుగా పాల్గొని ప్రజాసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువ రాజకీయ నాయకుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు దేశ అభివృద్ధి, వికసిత భారత్ నిర్మాణంలో యువత భాగస్వామ్యంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యువమోర్చా నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో మండల విద్యాశాఖ అధికారి రమణప్ప, డిప్యూటీ తహసీల్దార్ మునిస్వామి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చంద్ర మోహన్, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణం, కోటిరెడ్డిపల్లి అంజి, బీజేపీ నాయకుడు గణపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 310 క్వింటాళ్ల
## పీడీఎస్ బియ్యం పట్టివేత



**నెల్లూరు/వెంకటాచలం, ఆగస్టు 10, మనసులో మాట:**

జిల్లా పరిధిలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌ఓ ఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించగా ఈ అక్రమ తరలింపు వెలుగులోకి వచ్చింది. ఏపీ 26 టీఈ 1233 నంబరు గల లారీలో 620 బస్తాల్లో తరలిస్తున్న 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీతో పాటు బియ్యాన్ని వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై 6 ఏ నివేదికను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పించనున్నట్లు డీఎస్‌ఓ ఐ పుల్లయ్య తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వెంకటాచలం, ఆత్మకూరు సీఎస్‌డీటీలు సైమన్ బాబు, అజేయుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం–2026 వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



కలసి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ప్రచార కార్యక్రమాలు, ప్రత్యక్ష కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారం, విద్యార్థుల భాగస్వామ్యం, మొక్కలు నాటే కార్యక్రమం, హర్ ఘర్ తిరంగా, మువ్వన్నెల విద్యుత్ దీపాలంకరణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని చాటే కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలు కేవలం వేడుకలను వీక్షించే వారిగా కాకుండా, తమ బాధ్యతను గుర్తించి దేశ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా మారేలా ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి ఇంటిపై, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 14న జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. జాతీయ జెండాను చేతబట్టి "దేశ నిర్మాణంలో నా వంతు కృషి చేస్తాను" అనే స్ఫూర్తితో ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఆగస్టు 14, 15 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ భవనాలు, జన సంచారం ఎక్కువ ఉన్న ప్రదేశాలు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు తదితర ముఖ్య ప్రదేశాలను జాతీయ జెండాలోని మువ్వన్నెలతో విద్యుత్ దీపాలతో ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించేలా అలంకరించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు "అనే నేను" కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. "అనే నేను" కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో తాము ఏమవ్వాలనుకుంటున్నారో, రాష్ట్రానికి, దేశానికి ఎలా సేవ చేయాలనుకుంటున్నారో, దేశ నిర్మాణంపై వారి దృష్టికోణం ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. ఉత్తమ ప్రతిజ్ఞలను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించి విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు "అనే నేను" పేరుతో సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, క్రీడాకారులు, మేధావులు, స్థానిక ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు 30 నుంచి 60 సెకన్ల నిడివి గల సెల్ఫీ వీడియోలు రూపొందించి తమ పేరు, తాము దేశ నిర్మాణంలో పోషించదలచిన పాత్రను తెలియజేయాలని సూచించారు. వీడియో చివరలో ఇతరులను కూడా ఈ ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునివ్వాలని, "80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" తెలియజేయాలని తెలిపారు. ఈ ప్రచారంలో పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్, మై ఇండియా మై విజన్, ఇండిపెండెన్స్ డే 2026, అనేనేను హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగిస్తూ, @ ఏపీఆఫీసియల్ న్యూస్‌ను ట్యాగ్ చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు జాతీయ జెండాను చేతిలో పట్టుకుని వీడియో రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలోని అధికారుల, సిబ్బంది, లబ్ధిదారులు, ప్రజలు, విద్యార్థులు, యువతను ఈ ప్రచారంలో భాగస్వాములుగా చేయాలని సూచించారు. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను ప్రచారం చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, గ్రామపంచాయతీలు, స్వర్ణాంధ్ర-వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రజలతో ప్రత్యేక సెల్ఫీ వీడియోలు రూపొందించి ప్రచారం చేయాలని సూచించారు. ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో మొక్కలు నాటడం, ప్రతిజ్ఞలు చేయించడం, జాతీయ జెండా ఎగురవేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. విద్యాసంస్థల భవనాలను మువ్వన్నెల విద్యుత్ దీపాలతో అలంకరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 15న సమాచార శాఖ సమన్వయంతో వాట్సాప్, ఐవి ఆర్ఎస్ తదితర డిజిటల్ మాధ్యమాల ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ సందేశాలను ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రతిబింబించే అంశాలను సేకరించి మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యమే "పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్ " ప్రచారం ప్రధాన లక్ష్యమని, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో స్ఫూర్తిదాయకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డీపీఓ సుశీలా దేవి, ఆర్ఐఓ గోపాల్ రెడ్డి, డీఈఓ కుమార్, సెట్విన్ అధికారి యశ్వంత్, డ్వామా పీడీ మద్దిలేటి, బీసీ కార్పొరేషన్ అధికారి భరత్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జయభారత్ రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ జగదీష్, సమాచార శాఖ డి.ఐ.పి. ఆర్.ఓ.గురుస్వామి చెట్టి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాల్సిందే

### అనంతపురంలో వెటరన్ జర్నలిస్టుల ధర్నా

**అనంతపురం , మనసులో మాట,ఆగస్టు, 10**



దేశంలోని 19 రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ సీనియర్ జర్నలిస్టులకు తక్షణమే గౌరవప్రదమైన పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెటరన్ జర్నలిస్టులు ఆందోళన బాట పట్టారు. జిల్లా వెటరన్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో జీవితాలను అంకితం చేసి, ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించిన సీనియర్ పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. వయసు మీద పడిన జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**19 రాష్ట్రాల్లో అమలు.. ఏపీలో ఎందుకు ఆలస్యం?**

దేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాలు అమలవుతున్నాయని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ వెంటనే పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వృద్ధాప్యంలో వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సమాచార శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని నాయకులు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు.

***డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలి*** : వృద్ధాప్యంలో ఉన్న పాత్రికేయులకు పెన్షన్ పథకం ఎంతో అవసరమని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వెటరన్ జర్నలిస్టులు, సీనియర్ పాత్రికేయులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# డీఎస్సీ అవకతవకలపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

- లోకేష్ రాజీనామా చేయాలి
- కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పోలీసుల ఆంక్షలను అధిగమించి మనుబోలులో భారీ నిరసన ర్యాలీ




**నెల్లూరు/మనుబోలు, ఆగస్టు 10, మనసులో మాట:**

డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ ఆధ్వర్యంలో వీరభద్రస్వామి దేవస్థానం నుంచి జాతీయ రహదారి వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ సాగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ర్యాలీని కొనసాగించాల్సిందేనని పట్టుబట్టిన కాకాణి పూజితమ్మ పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు పలు ప్రాంతాల్లో ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ కార్యకర్తలు ముందుకు సాగారు. అనంతరం ర్యాలీ ప్రాంతానికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేరుకోవడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు చేరుకుని ర్యాలీని ముగించారు.

**లోకేష్ రాజీనామా చేయాలి: కాకాణి**

ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాల్లో అవకతవకలపై ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించిన అనంతరం ఈ భారీ ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. ప్రతిపక్ష పార్టీ నిరసనలను పోలీసులు అడ్డుకోవడం, బ్యానర్లను తొలగించడం, ఆంక్షలు విధించడం దారుణమని కాకాణి ఆరోపించారు. పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా ర్యాలీలో పాల్గొన్న యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను దెబ్బతీస్తోందని కాకాణి విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో విద్యారంగంలో చేపట్టిన కార్యక్రమాలకు భిన్నంగా ప్రస్తుతం విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆరోపించారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్ని ఆంక్షలు ఎదురైనా అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాకాణి పూజితమ్మ మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీ ప్రారంభం నుంచే పోలీసులు పలుమార్లు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ నాయకులు, కార్యకర్తలు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగారని చెప్పారు. అర్హత సాధించిన అభ్యర్థులకు డీఎస్సీ నియామక ప్రక్రియలో అన్యాయం జరిగిందని ఆమె ఆరోపించారు. ఉపాధ్యాయుల నియామకంలో పారదర్శకత లేకపోతే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని అన్నారు. కష్టపడి చదివిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయి వారి కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయని పేర్కొన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కార్యకర్తలకు ఉన్న నమ్మకమే కార్యక్రమాల విజయానికి కారణమని పూజితమ్మ అన్నారు. ఆయన అందుబాటులో లేని సమయంలోనూ కార్యకర్తలు అదే పట్టుదలతో పనిచేశారని ప్రశంసించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు చూపిన పోరాట స్ఫూర్తికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని కాకాణి పూజితమ్మ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఎల్.నీ.నో పై రైతులకు అవగాహన

**కలికిరి ఆగస్టు 10 (మనసులో మాట) :**




ఆచార్య ఎన్ జి రంగా, తిరుపతి, పెరుమాళ్ళపల్లి, కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్, కలికిరి కేవీకే, స్థానాలు నుండి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల బృందం వాల్మీకిపురం మండలంలోని మూరేవాండ్లపల్లి, మంచూరు, శాకంవారిపల్లి,అయ్యావారిపల్లి గ్రామాలలో సోమవారం పర్యటించారు. ఎల్ ని నో పరిస్థితుల ప్రభావం తో తీవ్ర వర్ష భావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దెబ్బతింటున్న పంటలను పరిశీలించారు. ఖరీఫ్ వేరుశనగ పంట వర్షాలు లేనందువలన విస్తీర్ణం తగ్గి నట్లు గమనించారు. అంతర పంటలు గా వేసిన కంది,అలసంద, అనుమల పంటలను పరిశీలించారు. వ్యవసాయ బోర్లలో నీరు రాక వేరుశనగ, వరి, వంటి పంటల సాగు విస్తీర్ణం తగ్గించామని రైతులు పేర్కొన్నారు. పశువులకు గడ్డి కొరత ఏర్పడుతుందని గవర్నమెంట్ తరపున సైలేజ్ ఇస్తే ఉపయోగం అని రైతులు తెలిపారు. ఇక మీదట వర్షం పడితే కంది, అలసంద, అనుములు , ఉలవ, మినుము, జొన్న ,సజ్జ ,ఆముదం మొదలగు పంటలను సాగు చేయాలని రైతులను శాస్త్రవేత్తలు కోరారు . పంట నుంచి వచ్చే వ్యర్థాలను, ఆకులను, చిరుకొమ్మలను మొదలగు వాటిని కొద్దిపాటి విస్తీర్ణంలో పెంచుకుంటున్న కూరగాయలు, పండ్ల తోటలలో, మరియు పూల తోటలలో మల్చింగ్ చేయాలని కోరారు . వీలైన వారు పొలాల దగ్గర వర్షపు నీరు నిలువ చేయటానికి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు .రైతులు పంట భీమా తప్పనిసరిగా చేయించుకోవాలి చెప్పారు .అదే విధంగా కే.వి.కె, కలికిరి ప్రాంగణంలో వివిధ గ్రామాల రైతులను సమావేశ పరిచి ,ఎల్.ని.నో పరిస్థితుల మీద అవగాహన కార్యక్రమం చేపట్టారు అనంతరం అధికారులు,రైతులు ,విద్యార్థినీ విద్యార్థులు, కే.వి.కె సిబ్బంది ఎల్‌నినో ప్రభావం పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ,కలికిరి ,సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ కె. మంజుల ,పెరుమాళ్ళపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం, ప్రధాన శాస్త్రవేత్త డా. ఎమ్. శాంతిప్రియ , శాస్త్రవేత్త కె ఆర్ ఠాగూర్, ప్రాంతీయ వ్యయసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్. బి . సహజా దేవ , డా" బి. సంతోష్ , కె వి కె శాస్త్రవేత్తలు ,అగ్రి పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు డా. త్రివిక్రమ్ రాజు ,నీలిమ మరియు రైతులు , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అబాకస్ పోటీల్లో సత్తా ప్రద్యుమ్న సాయి




**పలమనేరు ఆగస్టు 10( మనసులో మాట):**

10వ రాష్ట్రస్థాయి యు సి ఏం ఏ ఎస్ అబాకస్ పోటీల్లో సత్తా చాటిన సి. ప్రద్యుమ్న సాయి గుంటూరులోని ఏ కన్వెన్షన్ హాల్ లో యుసి ఏం ఏ ఎస్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో యు సి ఏం ఏ ఎస్ అబకస్ పలమనేరు విద్యార్థి సి.ప్రద్యుమ్న సాయి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచాడు.ఈ పోటీల్లో ప్రద్యుమ్న సాయి తన వేగం, ఏకాగ్రత, ఖచ్చితత్వంతో ప్రతిభను చాటుకుని విసుల్ కాంపిటీషన్ లో 2వ స్థానం సాధించాడు. అలాగే లిస్టెనింగ్ కాంపిటీషన్ లో 4వ స్థానం సాధించి ట్రోఫీని అందుకున్నాడు.విజేతలకు ఉమస్ ఇండియా ప్రెసిడెంట్ స్నేహల్ కారియా ట్రోఫీలను అందజేశారు.ప్రద్యుమ్న సాయి సాధించిన ఈ విజయంతో UCMAS Abacus పలమనేరుకు, అతని తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా నిలిచిందన్నారు. అతని కృషి నిరంతర సాధన పట్టుదలకు ఈ విజయం నిదర్శనం అన్నారు.సి . ప్రద్యుమ్న సాయికి యు సి ఏం ఏ ఎస్, ఏ బి ఏ సి యు ఎస్ పలమనేరు తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు.

# మహిళలు స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



**వాకాడు మనసులో మాట అగస్ట్ 10:**

వాకాడు మండలం బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా నూతనంగా ఎంపికైన శ్రీనివాసులను సోమవారం తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమ రెడ్డి సాయంత్రం వాకాడులో శ్రీనువాసుల ను వ్యక్తిగతంగా కలుసుకొని, ఘనంగా సన్మానించారు. అనంతరం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ. వాకాడు మండలంలో బిజెపి పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలన్నారు. బిజెపి పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి వారికి తగిన పదవులు కూడా రాబోయే రోజుల్లో పొందుతారని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బిజెపి పార్టీ అభివృద్ధిని ముందుకు తీసుకొని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు మండలం మాజీ బిజెపి అధ్యక్షుడు, తిరుపతి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు కాలవల్లి ప్రసాద్ ఉన్నారు.

## మహిళా చట్టాలపై విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలి



- చెన్నూరు సిఐ చాంద్ బాషా

**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు, 10:**

మహిళా చట్టాలపై విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలని చెన్నూరు సిఐ చాంద్ బాషా పేర్కొన్నారు, వైయస్సార్ కడప జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం సోమవారం చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలకు చెన్నూరు సీఐ చాంద్ భాషా చెన్నూరు పోలీసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సీఐ చాంద్ భాషా మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చిందని విద్యార్థినిలకు వివరించారు, సైబర్ క్రైమ్ దిశా శక్తి అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటిపై సవివరంగా విద్యార్థులకు తెలియజేశారు, ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు పోలీసులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## యువ రాజకీయ నాయకుల సంభాషణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



- ఆగస్టు 22, 23 తేదీల్లో వికసిత్ భారత్ కార్యక్రమం

**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట)**

భారతీయ జనతా యువమోర్చా ముదిగుబ్బ మండల అధ్యక్షుడు శివకుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించనున్న "వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్ డైలాగ్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి హాజీవలి సాహెబ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. యువతను రాజకీయ, సామాజిక రంగాల్లో చైతన్యవంతం చేయడంతో పాటు, భవిష్యత్ నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆగస్టు 22, 23 తేదీల్లో జరిగే కార్యక్రమాన్ని యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వామ్యం, నాయకత్వంపై కార్యక్రమంలో చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్, సీనియర్ సహాయకుడు సీనా, ముదిగుబ్బ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చంద్రమోహన్, బీజేపీ యువమోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ఎగసిపడ్డ 'జనాగ్రహం'..!

- మంత్రి నారా లోకేష్ సొంత గడ్డపైనే నిరసన సెగ
- 15 వేల మందితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ నిరసన ర్యాలీ
- లోకేశ్ రాజీనామా చేయాలి' అంటూ గర్జించిన యువత
- బైపాస్ జంక్షన్ నుంచి టవర్ క్లాక్ వరకు జనప్రవాహం
- నాలుగు గంటల పాటు నినాదాలతో హోరెత్తిన చంద్రగిరి





**తిరుపతి బ్యూరో, ఆగస్టు 10 (మనసులో మాట) :**

చంద్రగిరి బైపాస్ జంక్షన్ వద్ద ఉదయం నుంచే సందడి మొదలైంది. సమయం గడిచేకొద్దీ ఒక్కొక్కరుగా చేరిన జనంతో జంక్షన్ కిక్కిరిసిపోయింది. చేతుల్లో జెండాలు.. మెడల్లో కండువాలు.. చేతుల్లో ప్లకార్డులు.. ప్రతి ఒక్కరి నోట నినాదాలు. కొద్దిసేపటికే బైపాస్ జంక్షన్ జనసంద్రంగా మారింది. డీఎస్సీ-2025 నియామకాలపై నిరసనగా వైఎస్ఆర్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీ మొదలైంది. 'డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి.. నిరుద్యోగులకు న్యాయం చేయాలి.. మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి' అంటూ నినాదాలు ఒక్కసారిగా హోరెత్తాయి. ముందువరుసలో యువత, విద్యార్థులు కదలగా.. వెనుక నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అడుగులు కలిపారు. బైపాస్ నుంచి ప్రధాన రహదారిపైకి ర్యాలీ చేరే సరికి ఎటు చూసినా జనమే కనిపించింది. ర్యాలీ నెమ్మదిగా ముందుకు కదులుతున్నా నినాదాల వేగం మాత్రం తగ్గలేదు. 'న్యాయం కావాలి.. డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలి.. మంత్రి పదవికి నారా లోకేష్ రాజీనామా చేయాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ యువత గర్జించింది.. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కార్యకర్తల మధ్య నడుస్తూ వారిని ఉత్సాహ పరిచారు. ఆయన వెంట భారీగా జనప్రవాహం కదిలింది. ఆ మార్గమంతా వైఎస్ఆర్‌సీపీ జెండాలు రెపరెపలాడటంతో చంద్రగిరి ప్రధాన వీధులన్నీ రాజకీయ నిరసన వేదికగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 15వేల మంది జనం ఒక్కసారిగా చంద్రగిరి పట్టణంలోకి ప్రవేశించడంతో పోలీసులు ఉలిక్కి పడాల్సిన పరిస్థితి వచ్చింది. రెండు కిలోమీటర్ల ర్యాలీ నాలుగు గంటల పాటు సాగడంతో ప్రధాన రహదారి మొత్తం జనంతో నిండిపోయింది.. పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను దారి మళ్లించి ర్యాలీలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గం కేంద్రంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన భారీ నిరసన ర్యాలీ విజయవంతమైంది. చంద్రగిరి బైపాస్ రోడ్డు నుంచి టవర్ క్లాక్ వరకు సోమవారం చేపట్టిన నిరసన ర్యాలీలో 15వేల మందికిపైగా యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా బైపాస్‌రోడ్డు జంక్షన్ వద్ద ప్రచార రథంపైకి ఎక్కిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందరికీ అభివాదం చేస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం చంద్రబాబు ప్రభుత్వం మూడు మోసాలు.. ఆరు అబద్ధాలతో కాలం గడుపుతుందే తప్ప ప్రజలకు ఎక్కడా మంచి చేయడం లేదని ఆరోపించారు.

### ఆ ఇద్దరు.. జనంతో మమేకమై..

చంద్రగిరి పట్టణంలో చేపట్టిన భారీ నిరసన ర్యాలీలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ఇద్దరు జనంతో మమేకమైపోయారు. ర్యాలీ సాగినంత దూరం ప్లకార్డులు చేతబట్టుకుని పోరాటం తమకు కొత్తకాదు అన్నట్టుగా అడుగులు ముందుకు వేస్తూ నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ పతనానికి చంద్రగిరి నుంచే ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతోందని, ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్దుకోకుంటే ప్రజల ముందు దోషిగా నిలబడటం ఖాయమని హెచ్చరించారు.

### రెండు కిలోమీటర్లు.. నాలుగు గంటలు..

చంద్రగిరి బైపాస్ రోడ్డు నుంచి చంద్రగిరి టవర్‌క్లాక్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం.. నాలుగు గంటల పాటు సాగిన ర్యాలీకి సుమారు 15 వేల మంది హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన ఆ ర్యాలీ టవర్ క్లాక్ వద్దకు మధ్యాహ్నం 1 గంటలకు చేరుకుంది. మంత్రి నారా లోకేష్ స్వగ్రామం వున్న సొంత మండలంలోనే ఆయన శాఖకు సంబంధించిన డీఎస్సీ అంశంపై ఇంత భారీ ఎత్తున నిరసన జరగడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ప్రభుత్వం స్పందించకపోతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వైఎస్ఆర్ సీపీ నేతలు హెచ్చరించారు.

### భద్రతలో చేతులెత్తేసిన పోలీసులు

చంద్రగిరిలో చేపట్టిన నిరసన ర్యాలీకి అనూహ్యంగా జనం పెరిగిపోవడంతో పోలీసులు కట్టడి చేయలేక చేతులెత్తేశారు. బైపాస్ జంక్షన్ నుంచి వాహనాలను దారిమళ్లించినప్పటికీ జనం విపరీతంగా రావడంతో ఆ వీధులన్నీ జనంతో కిక్కిరిశాయి. ఒకరిపై మరొకరు తొక్కుకుంటూ ముందుకు రావాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో చంద్రగిరి పోలీసులు భద్రత కల్పించలేమని చేతులెత్తేయగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి 25 మంది ప్రయివేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోగా వారు రంగంలోకి దిగి నిరసన ర్యాలీ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. టవర్‌క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఈ ప్రభుత్వం యువతకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు చేసిన మోసాన్ని బహిర్గతం చేస్తూ ర్యాలీని ముగించారు.

# 2047 పై నియోజకవర్గ అధికారుల అవగాహన సదస్సు




**సూళ్లూరుపేట, ఆగస్టు 10(మనసులో మాట):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన, సమగ్రమైన మరియు ఆర్థికంగా బలీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్వర్ణాంధ్ర 2047 (స్వర్ణ ఆంధ్ర 2047) కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారుల అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రాధాన్యతలు, ఆర్థిక పురోగతి అవకాశాలు మరియు రంగాల వారీగా సేకరించిన సమాచారం ఆధారంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (CVAP) తయారీ పై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. జిల్లా స్థూల ఉత్పత్తి మండల స్థూల ఉత్పత్తి పై విశ్లేషణ, రంగాల వారీ వృద్ధి అవకాశాల గుర్తింపు మరియు శాఖల మధ్య సమన్వయం పై సదస్సులో కూలంకషంగా చర్చించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుంచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, ఎంఈఓ లు, ఎస్ జి ఎస్ డబ్ల్యు అధికారులు, పారిశ్రామిక ప్రోత్సాహక అధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, సాగునీటి శాఖల ఇంజనీర్లు, వెలుగు ఏపీఎం లు, డ్వామా ఏపీవో లు, సీడీపీఓ లు మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీలు



- అర్బన్ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో పోలీసుల తనిఖీలు

**ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట):**
మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అర్బన్ సీఐ శివరాముడు పోలీసు సిబ్బందితో కలిసి రాత్రి 3.55 గంటల సమయంలో మండల కేంద్రంలోని నాలుగు వైపులా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శివరాముడు మాట్లాడుతూ.. ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకుండా ప్రయాణించే వాహనాలను గుర్తించడంతో పాటు, అక్రమంగా గంజాయి తరలించే వారు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచేందుకు రాత్రి వేళల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఆధార్ కార్డు గుర్తింపు కార్డులు వెంట ఉంచుకోవాలని అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు సులువుగా ఉంటుందని సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు ఈనెల 11వ తేదీన కుప్పం పర్యటన



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఆగస్టు,10: (మనసులో మాట):**
రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు పి వెంకటప్ప ఈనెల 11వ తేదీన కుప్పం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన విజయవాడ నుండి బయలుదేరి, పదో తేదీ రాత్రి కుప్పం స్టేట్ గెస్ట్ హౌస్ నందు బస చేయునున్నారు, ఈ నెల 11వ తేదీన ఉదయం 8 ఎనిమిది గంటల నుండి ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు కుప్పం లోని గంగమ్మ ఆలయాన్ని అమ్మవారిని దర్శించుకుంటారు. కుప్పం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండపం నందు నిర్వహించే సభలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు, గిరిజనుల ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తారు, సాయంత్రం నాలుగు గంటల నుండి, అనంతపురం కి రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్తారు ప్రకటనలో తెలిపారు.

# శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టాలను తగ్గించుకోవచ్చు

**సత్యవేడు ఆగస్టు10(మనసులో మాట):**
రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టాలను తగ్గించుకోవచ్చని ప్రిన్సిపల్ సైంటిస్ట్(ఎంటమాలజి) మురళీకృష్ణ సూచించారు.సోమవారం సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఏడిఏ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలన్నారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండటం, దీర్ఘకాలిక పొడి విరామాలు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల్లో తేమను సంరక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వరి,సజ్జ





పంటల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ కీలక దశల్లో తేమ ఒత్తిడి రాకుండా చూడాలని సూచించారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల నేల సహజ సారము కోల్పోతుందన్నారు. పైగా వ్యవసాయంలో వాడే పురుగు మందులు కూడా భూగర్భ జలాల్లోకి చేరి నీటిని కలుషితం చేస్తున్నాయన్నారు. నీటి వనరులు అతిగా వాడడం వల్ల రసాయనాల వల్ల గ్రీన్ హౌస్ ఉద్గారాలు పెరిగిపోయి వాతావరణం దెబ్బతింటున్నట్లు ఆయన వివరించారు. వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లను తట్టుకోవడానికి పకృతి సేద్యం,నీటి సంరక్షణ, సేంద్రీయ పద్ధతులను పాటించడం ముఖ్యమన్నారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక,నీటి పొదుపు,నేలలో తేమ సంరక్షణ,పురుగులు,తెగుళ్ల నివారణ,వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు తదితర అంశాలపై తిరుపతి ఆగ్రోమెట్ శాస్త్రవేత్త ప్రతిమ వివరించడం జరిగింది. తదనంతరం శాస్త్రవేత్తల బృందం రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్వీ వ్యవసాయ కళాశాల డాక్టర్ నిర్మల్ కుమార్, డా. లక్ష్మి, డా.టి.మహేష్ బాబు,డా. కె. శ్రీనివాసులు,అనిల్,వ్యవసాయ ఏవో మురళి పలువురు రైతులు పాల్గొన్నారు.

# నేతన్న సేవ అక్రమాలపై విచారణ జరపాలి

- కదిరి రైల్వే గేటు వద్ద చేనేత కార్మికుల ధర్నా
- ఐదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ

**ధర్మవరం ఆగస్టు 10 (మనసులో మాట):**
నేతన్న సేవ పథకం అమలులో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం పట్టణంలోని కదిరి రైల్వే గేటు వద్ద నేతన్న విగ్రహం సమీపంలో వందలాది మంది చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'నేతన్న సేవ' పథకంలో అర్హులైన కార్మికులకు కాకుండా అనర్హులకు ప్రయోజ



నం చేకూరిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బంది చేతివాటంతో అర్హులైన చేనేత కార్మికులకు పథకం ప్రయోజనాలు అందకుండా పోయాయని ఆరోపించారు.చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఉన్న 'నేతన్న సేవ' లబ్ధిదారుల జాబితాలను ఉన్నతాధికారులతో విచారణ చేయించి, అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి పథకం కింద అందాల్సిన రూ.25 వేల ఆర్థిక సహాయం వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

**ఐదు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ**

చేనేత కార్మికులు రోడ్డుపై ధర్నా చేపట్టడంతో పోలీసులు, హ్యాండ్లూమ్ అధికారులు అక్కడికి చేరుకుని కార్మికులతో చర్చించారు. సమస్యను ఐదు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు.అయితే ఇచ్చిన హామీ మేరకు అర్హులైన కార్మికుల సమస్య పరిష్కరించకపోతే ఆగస్టు 11న మంగళవారం ఉదయం 10 గంటలకు ధర్మవరం ఆర్డీవో కార్యాలయం వద్ద మరోసారి ధర్నా చేపడతామని వెంకటనారాయణ తెలిపారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న సేవ పథకం కింద రూ.25 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు గుర్రం వెంకటస్వామి, రవికుమార్, రమణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన : రావిళ్ల

తొట్టంబేడు, ఆగస్టు 10 (మనసులో మాట) :
శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు రావిళ్ల మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం రౌతుసురమాల పంచాయతీ పరిధిలోని రౌతుసురమాల గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను తెలియజేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా



సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, డి. రామ నాయుడు, ధాము, క్లస్టర్ ఇన్‌చార్జి జైచంద్ర నాయుడు, యూనిట్ ఇన్‌చార్జీలు లెక్కల మురళి నాయుడు, జి. శంకర్ నాయుడు, బూత్ ఇన్‌చార్జీలు గంధం శ్రీను, చెంచయ్య, కనపతి శంకర్ నాయుడు, బోసుపల్లి రాజేంద్ర, గోపి, ఎస్సీ నాయకులు కనపతి చంద్ర, సింగమాల సునీల్, రత్నయ్య, తాడిపత్రి సుబ్రహ్మణ్యం, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు గంగ కాలువలో మహిళా మృతదేహం లభ్యం



వరదయ్యపాలెం ఆగస్టు10(మనసులో మాట)

తిరుపతి జిల్లా వరద పాలెం మండలం నాగనందపురం సమీపంలోని తెలుగు గంగ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమయింది. సోమవారం ఉదయం పనుల కోసం వెళ్ళిన ఉపాధి హామీ కార్మికులకు కాలువలో తేలుతున్న శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి సత్యేడు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాగా మృతి చెందిన మహిళ కె.వి.బి పురం మండలం సూరమాలకు చెందిన భువనేశ్వరి(55)గా గుర్తించారు. ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లినట్లు తెలిసింది. తినే పద్యంలో తెలుగు గంగలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ మేరకు మృతురాలు కుమారుడు మునయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా



- కదిరి న్యాయస్థానం తీర్పు

ముదిగుబ్బ, ఆగస్టు 10: (మనసులో మాట):

మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన ముదిగుబ్బకు చెందిన వ్యక్తికి కదిరి న్యాయస్థానం రూ.10 వేల జరిమానా విధించింది. అర్బన్ సీఐ జి శివరాముడు పోలీసుల వివరాల మేరకు ముదిగుబ్బ గ్రామంలోని చెలిమిబావి వీధికి చెందిన పిట్టు హరి (33), పి. గంగులప్ప కుమారుడు, ఈ నెల 8వ తేదీ సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో ముదిగుబ్బలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నాడు. ఈ సందర్భంగా పోలీసులు నిర్వహించిన మద్యం సేవించి వాహనం నడిపే వారిపై తనిఖీల్లో హరి పట్టుబడ్డాడు. దీంతో అతనిపై చిన్న కేసు నమోదు చేసి, మోటారు వాహనాల చట్టంలోని 185a సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడు పిట్టు హరిని కదిరి గౌరవ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం ఎస్టీసీ నంబర్ 2214/2026లో పిట్టు హరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 'వెల్ఫేర్' టోకరా

(మొదటిపేజీ తరువాయి)

అనువైన లే అవుట్, 100% క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్, వాచ్ మెన్ పర్యవేక్షణ, పార్క్ అభివృద్ధి అంటూ ప్రచారాన్ని హోరెత్తించి "వెల్ఫేర్ టౌన్ షిప్ నాయుడుపేట" పేరుతో "వెల్ఫేర్" గ్రూపు ఎమ్డీ మళ్ల విజయ ప్రసాద్ ఏర్పాటు చేసిన వెంచర్ లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ లే అవుట్ తీరు తెన్నులను ఒకసారి పరిశీలిస్తే అనేక అవకతవకలు సుస్పష్టం అవుతున్నాయి. నెల్లూరు జిల్లా నాయుడుపేట మండలం తుమ్మూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 31పి, 33పి, 34పి, 35పి, 36పిలలో సుమారు 20ఎకరాలలో వెల్ఫేర్ టౌన్ షిప్ ఏర్పాటు చేశారు. ఈ లే అవుట్ కు ఒకవైపు చెన్నై కోల్ కత్తా జాతీయరహదారి, వేరొక వైపు రైల్వే ట్రాక్, మరోవైపు సాగునీటి అవసరాలకు ఉపయోగించే చెరువు ఉన్నాయి. ఈ లే అవుట్ వేసే ముందు ఖచ్చితంగా ఎన్.హెచ్. అథారిటీ నుండి అనుమతి తీసుకోవాలి. మూడు వైపులా బఫర్ జోన్స్ విడిచిపెట్టాలి. డిటిసిపి అనుమతి పొందకుండా లే అవుట్ వేశారు. బ్రోచర్లో పేర్కొన్న విధంగా లే అవుట్ లో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. కనీసం రోడ్లు, కాలువలు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ లే అవుట్ లో ప్లాట్లకు కూడా అసంబద్ధమైన ధరలు నిర్ణయించి, ఏజెంట్లకు బలవంతాన అంటగడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వెంచర్లో ప్లాట్లు తీసుకున్నవారు వాటిని ఉంచుకోలేక, అమ్ముకోలేక అగచాట్లుకు గురవుతున్నారు. ఎటువంటి అభివృద్ధికి నోచుకోని ఆ ప్లాట్లు మాకొద్దని ఖాతాదారులు ఏజెంట్ల మొఖానే చెప్పేస్తుండటం, యాజమాన్యం కట్టిన డబ్బులు ఇవ్వలేమని ప్లాట్లు తీసుకోవాలని ఒత్తిడి చేస్తుండటం వల్ల ఏజెంట్ల పరిస్థితి "అడకత్తెరలో పద్ద పోకచెక్కలా" తయారైందని లబోదిబోమంటున్నారు. బయట వ్యక్తులకు ప్లాట్లు అమ్ముకునేందుకు ఏజెంట్లు ప్రయత్నిస్తున్నా అవి సగం ధరకు కూడా అమ్ముడుపోక పోతుండటంతో ఏజెంట్లు అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ లేఅవుట్ పై తక్షణమే రెరా, నుడా, ప్రభుత్వం దర్యాప్తు నిర్వహించాలని, తమకు న్యాయం చేయాలని ఏజెంట్లు, ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.




## మెగా డీఎస్సీపై వైసీపీ ర్యాలీని ఖండించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్




**శ్రీకాళహస్తి, ఆగష్టు 10 (మనసులో మాట) :** మెగా డీఎస్సీపై వైసీపీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించిన ర్యాలీని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 16,340 పోస్టులతో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకపోయినా జరిగినట్లు వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.2019-24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో గతంలో అనేక డీఎస్సీలు నిర్వహించి వేలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను ప్రస్తావిస్తూ విద్యార్థులకు కిట్లు, తల్లికి వందనం, మెగా పేరెంట్స్ డే వంటి కార్యక్రమాలతో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ, విదేశీ పర్యటనల ద్వారా మెరుగైన బోధనా పద్ధతులను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, డీఎస్సీపై ఎక్కడైనా చర్చకు టీడీపీ సిద్ధంగా ఉందని గురువారెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని అన్నారు. శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ వ్యతిరేక ర్యాలీని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.